కథ

# నిజంగా నిజం!

భీమమరాజు వెంకటరమణ



రోజు ఉదయాన్నే నిద్రలేపి అప్పటికే ఆలస్యమైయిందంటూ హడావిడి చేస్తూ పాలకార్డు, సంచీ చేతికిచ్చి బయటకు తరిమే క్రిష్ణప్రసాదు భార్య సత్యశ్రీ ఆ రోజు అతనికి విరుద్ధంగా అంటే మృదువుగా లాలనగా నిద్ర లేపుతూ కనపడింది. చేతిలో పాల కార్డు లేదు సంచీ లేదు పైగా పెదవులపై చిరునవ్వు, చేతిలో ఘుమఘుమలాడే కాఫీ కప్పు.

తనకు మంచం దిగకుండానే భార్య కాఫీ తెచ్చి ఇవ్వడం అనేది ఎప్పుడో పది సంవత్సరాల క్రితం పెళ్ళయిన కొత్తల్లో జరిగినట్లు అతనికి లీలగా గుర్తు. లేచి కూర్చొని ఆమె కళ్ళలోకి చూస్తూ కప్పు అందుకున్నాడు. ప్రొద్దుటే భక్తి పాటలకు బదులు రేడియోలో "నిన్న లేని అందమేదో నిదుర లేచెనెందుకో" అనే పాట ప్రస్తుత సన్నివేశాన్ని మరింత రక్తి కట్టిస్తున్నది.

ఇది కలా నిజమా! తన చేతిపై తనే గిచ్చుకున్నాడు, నిజమే! ఆమె వయ్యారం వలకబోస్తూ "త్వరగా లేచి తయారవ్వండి, మీకిష్టమని ఉప్మా పెసరట్టు చేస్తున్నాను" అంటూ లోపలికి వెళ్ళింది. ఆ మధ్య ఎప్పుడో ఒకసారి అదే ఉప్మా పెసరట్టు చెయ్యమని అడిగినప్పుడు "ఒక్క టిఫిన్ చెయ్యటానికే చిరాకు పుడుతున్నది ఉప్మా పెసరట్టు రెండెవరు చేస్తారు?" అని విసుక్కున్నట్లు అతనికి బాగా గుర్తు. ప్రసాదుకు జరుగుతున్నదేమిటో అర్థం కావడం లేదు. అకస్మాత్తుగా వచ్చిపడిన ఆనందం.

ప్రసాదు చిన్నగా బాత్రూమ్ వైపు నడిచాడు, అప్పుడే బయటకొస్తున్న చంటి అని పిలవబడే ఎనిమిదేళ్ళ శరత్ "నాన్నగారు! మీకు అడ్డం కాకూడదని ముందే లేచి స్నానం చేసేసా, మీరు వెళ్ళండి!" అన్నాడు. ప్రసాదు చెవిలో అమృతం పోసినట్లుంది. నాన్నగారు అని అచ్చు తెలుగులో వాడెప్పుడూ పిలిచింది లేదు, ప్రతిరోజూ బాత్రూం దగ్గర వాళ్ళిద్దరికి ఎప్పుడూ యుద్ధమే. పైగా క్రికెట్ బ్యాట్ కొనివ్వలేదని కొద్ది రోజులుగా చంటి రుసరుసలాడుతున్నాడు కూడా. అలాంటిది "ఇవాళ ఇంత సభ్యతగా మాట్లాడుతున్నాడేమిటి?" చేతిమీద మళ్ళీ గిచ్చుకున్నాడు ప్రసాదు... నిజమే!

తయారై డైనింగ్ టేబుల్ దగ్గరకు వచ్చి కూర్చోగానే సత్యశ్రీ వచ్చి ప్రేమగా ప్రక్కన కూర్చొని వేడి వేడి ఉప్మా పెసరట్టు ప్లేటు అతని ముందు పెట్టింది. ఆమె అలా దగ్గరుండి టిఫిన్ పెట్టేది కేవలం వాళ్ల బంధువులెవరైనా వచ్చినప్పుడు మాత్రమే. ఇక మామూలుగా అయితే తనే పెట్టుకొని తినడం లేదా ఒక్కోసారి తనే టిఫిన్ తయారు చేసుకొని మరీ పెట్టుకొని తినడం అతనికి అలవాటుగా మారిపోయింది.

ప్రసాదు ఆఫీసుకి బయలుదేరాడు. ఆమె కూడా వాకిలిదాకా వచ్చి టాటా చెబుతూ గోముగా చూస్తూ "సాయంత్రం త్వరగా వచ్చేస్తారు కదూ!" అన్న మాటలకు ప్రసాదుకు ఒళ్ళంతా విపరీతంగా పులకరించి అసలు ఆ రోజు ఆఫీసుకి వెళ్ళబుద్ధి కాలేదు. కానీ వెళ్ళక తప్పదు, ఎందుకంటే మేనేజరు చండశాసనుడు, నిముషం ఆలస్యం అయితే గుడ్లు మిటకరిస్తాడు. పెద్ద పెద్ద క్లాసులు తీసుకుంటాడు. అసలే రావలసిన ఇంక్రిమెంట్ తొక్కిపెట్టాడు కూడాను.



బస్సు స్టాండుకి వచ్చి నిలబడిన ప్రసాదుకి మరొక షాక్, అక్కడ అందరూ క్యూలో నిలబడి ఉన్నారు, భాగ్యనగరంలో అలా చూడటం కలలో మాట. సాధారణంగా ఎడమ వైపుకి వంగిపోతూ వచ్చే పదహారో నెంబరు బస్సు ఆ రోజు నిటారుగ వచ్చింది, అయోమయానందాలతో అందరితోపాటు బస్సు ఎక్కిన ప్రసాదుకి మరొక జెర్క్. అదేమంటే అతనికి సీటు దొరికింది. ఆ బస్సులో ఉదయం ఆఫీసు సమయంలో సీటు దొరకటంకంటే ఎం.ఎల్.సీ. సీటు సులభం. అమితానందంలో తేలిపోతున్న ప్రసాదుకి బస్సు కిటికీలో నుంచి చూస్తుంటే భవనాలు, యాడ్ బోర్డుల స్థానంలో కొండలు చెట్లు సుందర దృశ్యాలు కనపడుతున్నాయి, ట్రాఫిక్ పొగకు బదులు అరేబియన్ పెర్ఫ్యూమ్‌ను ఆస్వాదిస్తున్నట్లుగా ఉంది.

***

కస్సుబుస్సు మేనేజరు ఆ రోజు అరగంట ఆలస్యమైనా ఏమీ అనలేదు సరికదా చిరునవ్వు చిందించాడు. తన సీటు వైపు చూసిన ప్రసాదుకు మరో విచిత్రం కనపడింది. తను కూర్చునే పాత కుర్చీ టేబుల్ స్థానంలో సరిక్రొత్తవి ఏర్పాటు అయినాయి. అది సాంబారుపొడి, కారప్పొడి మార్కెటింగ్ చేసే ఆఫీసులా లేదు, సాఫ్ట్‌వేర్ కంపెనీలా ఉంది. "మొన్న శనివారంనాడు ఇలా లేదు, సోమవారం వచ్చేసరికి ఎన్ని మార్పులు చేసారు?"అని ఆశ్చర్యపడుతూ అటుగా చూసి నోరెళ్ళ పెట్టాడు.

ఎదురు సీటులో కూర్చున్నది మరెవరో కాదు, ఆఫీసులోని ఆడవాళ్ళందరికంటే అందగత్తెగా పిలువబడే కంప్యూటర్ ఆపరేటర్ మాయ. ఆమెను చూసినప్పుడల్లా "గొప్ప సినిమా హీరోయిన్ కావలసిన ఆమె విధి వక్రించి ఆ ఆఫీసులో చేరిందేమో అనిపిస్తుంటుంది ప్రసాదుకి. ఎక్కడో ప్రక్క గదిలో ఉన్న ఆమె సీటు తనకు ఎదురుగా ఏర్పాటు కావడమేమిటి? అంత అందాన్ని

> ప్రసాదుకు తనసలు వేరే లోకంలో విహరిస్తున్నట్లుగా ఉంది, తనతో మాట్లాడుతున్న మనుషులందరూ తనకు అనుకూలంగా, తను చూస్తున్న పరిసరాలన్నీ అందంగా మారిపోతున్నాయి.

రోజూ చూస్తూ పనిచెయ్యటం అంటే ఎంత అదృష్టం? ప్రసాదు ఎటు చూసినా అందం ఆనందం, అతన్ని వెంటాడి మరీ పరవశింపజేస్తున్నాయి. తట్టుకోలేని స్థితిలో చేతి మీద గిచ్చుకున్నాడు, కలకాదు... నిజమే.

కాసేపు ఆఫీసులో పని చేసాడో లేదో మేనేజర్ తన సీటు వద్దకు వచ్చి "కంగ్రాట్స్ మిస్టర్ ప్రసాద్! నీ ఇంక్రిమెంట్ కన్ఫరం అయింది, జీతం రెండు వేలు పెరుగుతుంది, రేపో మాపో ఆర్డర్స్ వస్తాయి" అని చెప్పి భుజం తట్టి వెళ్ళిపోయాడు.

అసలు భార్యకు తను లోకువైపోయింది కూడా ఈ ఎదుగు బొదుగు లేని జీతం వల్లనే. జీతం పెంచమని అడిగినప్పుడల్లా భంగపడటమే జరిగింది. ఇకపై కాలర్ ఎగరేసి తిరగొచ్చు.

వరుస క్రమంలో వస్తున్న ఆనందాశ్చర్యాలను పొడిగిస్తున్నట్లుగా ఎప్పుడు పిల్లికి బిచ్చం పెట్టని పిసినారి గుమాస్తా పాండురంగయ్య పుల్లారెడ్డి స్వీట్స్‌తో ప్రసాదు దగ్గరకు వచ్చి "ప్రసాదూ! ఇదుగో ఈ స్వీట్ పాకెట్ తీసుకో! ఇవాళ మా పెళ్ళిరోజు అన్నాడు కాస్త ఫోజు కొడుతూ. తన చెవులను, కళ్ళను నమ్మలేని స్థితిలో ఆ పాకెట్ తీసుకొని ఆయనకు థాంక్స్ చెప్పాడు.

ప్రసాదుకు తనసలు వేరేలోకంలో విహరిస్తున్నట్లుగా ఉంది, తనతో మాట్లాడుతున్న మనుషులందరూ తనకు అనుకూలం గా, తను చూస్తున్న పరిసరాలన్నీ అందం గా మారిపోతున్నాయి.

(ముగింపు 17వ పేజీలో)

ఆదివారం క్విజ్

## సమాధానాలు

1. అరేబియా సముద్రం
2. ఇండియా
3. బెంగుళూరు
4. బిల్ గేట్స్
5. కేప్ టౌన్